క్లుప్తంగా

తోటల పెంపకానికి దరఖాస్తుచేసుకోండి

కోయిల్‌కొండ: గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పండ్లతోటల పెంకానికి ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి(గట్లవెంబడి మాత్రమే), డ్రాగన్‌ఫ్రూట్, సపోటా పండ్ల తోటలను పెంచుకోవచ్చన్నారు. తోట పెంచుకోవడానికి గుంతలు, మొక్కనాటాడానికి , ఊత కర్రకట్టాడానికి, మొక్కకొనుగోలుకు, ఎరువులు వేయడానికి, నెలనెల పర్యవేక్షణ చేయుడానికి 3ఏం వత్సరాల పాటు ఉపాధిహామీ ద్వారా డబ్బులు చెల్లించనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మండలం ప్రకటించాల్సిందే ..



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను నూతన మండలంగా ప్రకటించాల్సిందేనని జేఏసీ కన్వీనర్ రామునాయక్, వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం 180వ రోజు మండలసాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలేదీక్షలో వారు మాట్లాడారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ పాలమూరుశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని షాబజార్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పరిషత్ అధ్యక్షుడు పి.రమేష్ చందర్, హెచ్‌ఎం వేణుమాధవ్, బీవీపీ సభ్యులు వెంకటేశ్వర గుప్తా, జి.పాండురంగం , భూషణ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల నిరసన



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రం మెట్టుగడ్డ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం ఎదుట బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. బ్యాంకుల ప్రైవేటీకరణ దేశ ఆర్థిక, సామాజిక రంగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. ఖాతాదారులు ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని కోరారు. నిరసనలో ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ మహబూబ్‌నగర్ రీజినల్ సెక్రటరీ అభిలాష్‌రెడ్డి, డిప్యూటీ సెక్రెటరీ శివ నరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన జీవితం సాగించాలి

అడ్డాకుల: ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని సాగిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ మహేష్ అన్నారు. మండల కేంద్రంలోని అడ్డాకుల ట్యాలెంట్ స్కూల్‌లో బుధవారం మహబూబ్‌నగర్‌కు చెందిన మల్లిక ఆస్పత్రి ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహించారు. చిన్న పిల్లల్లో గుండె సంబంధిత వ్యాధులు ఉంటే వాటిని ముందే గుర్తించి నయం చేస్తే వారికి కొత్త జీవితాన్ని ఇచ్చినట్లవుతుందన్నారు. 6 నుంచి 15 సంవత్సరాల వయసున్న పిల్లల్లో గొంతు, కీళ్లు, మోకాళ్ల నొప్పులు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కరస్పాండెంట్ గోవర్ధనాచారి తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



మహమ్మదాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



జడ్చర్లలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

జడ్చర్ల టౌన్: పాతపింఛన్ విధానం కోరుతూ ఈనెల 16న జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రారంభమైన సాధన సంకల్ప రథయాత్రను జయప్రదం చేద్దామని టీఎస్‌సీపీఎస్‌ఈయూ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.బాలస్వామి పిలుపునిచ్చారు. రథయాత్ర ఈనెల 30న మహబూబ్‌నగర్ జిల్లాకు చేరుకుంటున్నందున బుధవారం మండలంలోని ప్రధాన కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులతో కలసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయ, మున్సిపాలిటీ, ఏరియా ఆస్పత్రి, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉద్యోగులను, అధికారులను కలిశారు. ఆయన వెంట సంఘ రాష్ట్ర కల్చరల్ సెక్రెటరీ నరేష్‌గౌడ్, జిల్లా కోశాధికారి రాఘవేంద్రగౌడ్, ఉద్యోగులు ఉన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, వెంకటయ్య, గోవర్ధన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేయాలంటూ మండల ఉపాధ్యాయులు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. హన్వాడ నుంచి మహమ్మదాబాద్‌లోని పలు గ్రామాలతో పాటు గండేడ్‌లో పాఠశాలలు సందర్శిస్తూ కార్యక్రమం నిర్వహించారు. మహమ్మదాబాద్, గండేడ్, హన్వాడ మండలాల అధ్యక్షులు వెంకటయ్య, గంటశ్రీనివాస్, కిష్ట్యానాయక్ మాట్లాడుతూ 2020లో పాఠ్యాంశాల్లో ఉన్న అశాస్త్రీయ అంశాలను తొలగించాలని, ఉపాధ్యాయుల పదోన్నతులను, బదిలీలను చేపట్టాలని నూతన పీఆర్‌సీ కమీషన్‌ను వేసి, జూలై 1 నుంచి ఆర్‌ఐ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఉద్యమంలో పాల్గొనాలని కరపత్రాలు పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రధాన కార్యదర్శులు సాయన్న, సంపత్, వేణుగోపాల్‌వర్మ, శివకుమార్ తదితరులు ఉన్నారు.



మిడ్జిల్‌లో...

నులి పురుగుల నిర్మూలనకు కృషిచేద్దాం



మాట్లాడుతున్న వైద్యాధికారి డా.అబ్దుల్ రబ్

భూత్పూర్: విద్యార్థుల కడుపులో నులి పురుగులు (నట్టలు) ఉండటంతోనే అనారోగ్య లక్షణాలు కన్పిస్తాయని మండల వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్ అన్నారు. బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ రామయ్య, ఎంఈఓ నాగయ్య, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గండేడ్: నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నామని విజయవంతం చేయాలని గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం పోస్టర్‌ను విడుదల చేశారు. సూపర్‌వైజర్లు అంబదాస్, అలవేలు, శాంతమ్మ, పీహెచ్‌ఎన్ లూయిస్ తదితరులు పాల్గొన్నారు.



గండేడ్‌లో పోస్టర్ విడుదల

బీఆర్‌ఎస్‌తోనే రైతుల అభ్యున్నతి



రైతులతో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రైతులు అభివృద్ధి చెందారని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం లాల్‌కోట రైతువేదికలో సమావేశం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాడన్నారు. అనేక పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని తరిమి కొట్టాలన్నారు. రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ మన్నెంగౌడ్, ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన



దేవరకద్రలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు



నవాబుపేటలో..



కోయిల్‌కొండలో..

దేవరకద్ర: మండల కేంద్రంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, నాయకులు బాలు, నాగరాజు, వీరన్న పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో ఉరి తాళ్లతో పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు లక్ష్మయ్య, శ్రీనువాస్, వెంకటయ్య, రమేష్, నర్సింహులు, రాములు, అంజయ్య, పెటయ్య తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎదురింటి నర్సిములు అన్నారు. బుధవారం సమ్మెలో పాల్గొని మాట్లాడారు. చెన్నయ్య, వెంకటయ్య, అజ్జు, పాష, రాందాస్, కురుమూర్తి పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

జడ్చర్ల టౌన్: ప్రజాహిత పాదయాత్రలో జిల్లా కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకుడు అనిరుధ్‌రెడ్డిపై గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఫిర్యాదులో కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్, ధారాసింగ్, వెంకటేశ్వర్లు, రవి ఉన్నారు.

క్షమాపణలు చెప్పాలి

జడ్చర్ల టౌన్: ప్రజాహిత పాదయాత్రలో జిల్లా కలెక్టర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన అనిరుధ్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు శ్రీనునాయక్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

బాలానగర్: అనిరుధ్‌రెడ్డి కలెక్టర్ రవినాయక్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ గిరిజన నాయకుడు బాలునాయక్ డిమాండ్ చేశారు.

క్షమాపణ చెప్పడానికి సిద్ధం కానీ..

బాలానగర్: కలెక్టర్‌పై తాను ఉద్దేశపూర్వకంగా ఎలాంటి దూషణలకు దిగలేదని, ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని సూచించానని పీసీసీ ప్రధానకార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం మాట్లాడుతూ విషయంలో తప్పుగా మాట్లాడితే క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. కానీ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా నుంచి విడిపిస్తామని అధికారులు హామీ ఇవ్వాలని కోరారు. తాను గతంలో ఎమ్మార్వోకు వివరించానని, అలాగే కలెక్టర్‌కు సైతం చెప్పినట్లు పేర్కొన్నారు. గిరిజనులను అవమానించేలా మాట్లాడలేదని, ఒక అధికారిని సైతం దూషించారంటూ చేస్తున్న ఆరోపణలు సమంజసం కాదన్నారు. తాను గిరిజనుల కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

వక్రీకరించటం తగదు

రాజాపూర్: ప్రజాహిత పాదయాత్రలో అనిరుధ్‌రెడ్డి వాస్తవాలు మాట్లాడితే వాటిని బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి చెప్పడం తగదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పాదయాత్రలో ప్రజలు అనేక సమస్యలను అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. సమస్యలను తెలుసుకుని ఆయన మాట్లాడుతున్నారని, అది తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. జనాదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొందరు గిరిజన నాయకులు జిల్లా కలెక్టర్‌ను కూడా దూషించారంటూ అవాస్తవాలను మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రజల్లోకి వెళ్లి వాస్తవాలు గ్రహించాలని సూచించారు. రంగారెడ్డిగూడ ఎంపీటీసీ సునీత, శ్రీనివాస్, వెంకట్‌నాయక్ ఉన్నారు.

బాలానగర్: గిరిజనులను కాంగ్రెస్ నేత అనిరుధ్‌రెడ్డి చాలా సందర్భాల్లో అండగా ఉండి ఆదుకున్న సందర్భాలు ఉన్నాయని నాయకులు శంకర్‌నాయక్, బద్రునాయక్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ బీఆర్‌ఎస్ శ్రేణులు రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. గిరిజన అధికారిని ఆయన ఉద్దేశపూర్వకంగా దూషించలేదని వారు వివరించారు.

పూర్తయిన మరమ్మతు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు అప్పన్నపల్లిలో మిషన్ భగీరథ పథకం మెయిన్ పైపు (750ఎంఎం) లైన్‌కు బుధవారం రాత్రి మరమ్మతు పూర్తయింది. అనంతరం జడ్చర్ల సమీపంలోని ఫిల్టర్‌బెడ్స్ నుంచి జిల్లా కేంద్రం పద్మావతీకాలనీలోని అయ్యప్పగుట్టపై ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు తాగునీటిని సరఫరా చేశారు. అయితే చెకింగ్ కోసం ఇంకా మెయిన్ (ఎన్‌హెచ్-167) రోడ్డుపై తవ్విన గుంతను మాత్రం పూడ్చలేదు. గురువారం మరోసారి పరిశీలించి దానిని సరిచేస్తామని మున్సిపల్ ఏఈ హరికృష్ణ తెలిపారు. కాగా, ఈనెల 18వ తేదీ ఉదయం భారీ వాహనాల ధాటికి ఈ పైపులైన్ పగిలిన విషయం విదితమే. చివరకు ఆగకుండా ముసురు వర్షం కురుస్తున్నప్పటికీ యుద్ధ ప్రాతిపదిక 36 గంటల్లోనే ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పైపులైన్ మరమ్మతు పూర్తి చేయగలిగారు.

ఎల్‌ఓసీ అందజేత

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లి తండాకు చెందిన పెద్ద గోపాల్ కుమార్తె శాంతి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా చక్రాపూర్‌కి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కర్రె బాలన్న భార్య వెంకటమ్మను హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే ఆల అక్కడికి వెళ్లి పరామర్శించారు.

'మొక్క'వోని పట్టుదల అవసరం



దేవరకద్రలో మొక్కలను పంపిణీ చేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్: హరితహారం లో ప్రతిఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని పోతన్‌పల్లి సర్పంచ్ సత్యమ్మ పిలుపునిచ్చారు. బుధవారం ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు. కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. రాంపూర్‌లో రోడ్డుకు ఇరువైపులా నాటుతున్న మొక్కలను పరిశీలించారు. వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని నర్సరీలో బుధవారం ఉచితంగా మొక్కల పంపిణీ చేపట్టారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ప్లాంటేషన్ సూపర్ వైజర్ వెంకట్‌రెడ్డి, ఈఓ సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోతన్‌పల్లిలో..



రుసుంపల్లిలో ..

గండేడ్: గ్రామాల్లో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రుసుంపల్లి, చిన్నవార్వాల్, పెద్దవార్వాల్ గ్రామాల్లోని నర్సరీలను, సెగ్రిగేషన్ షెడ్లను, క్రిమిటోరియాలను పరిశీలించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో విధిగా మొక్కలు నాటాలన్నారు. ఏపీఓ హరిశ్చంద్రుడు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వర్షంలోనూ అధికారుల సర్వే

మహబూబ్‌నగర్ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని చేపట్టిన ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం 58, 59 జీఓలను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే దరఖాస్తుదారులకు ఆ స్థలాలను క్రమబద్ధీకరణ చేసేందుకు రెవెన్యూ అధికారులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ పరిశీలనలు చేస్తున్నారు. కలెక్టర్ రవినాయక్ ఆదేశాల మేరకు క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం ఏనుగొండ రెవెన్యూ శివారు 25 సర్వే నంబర్‌లో తహసీల్దార్ బి.పార్థసారథి నేతృత్వంలో గిర్దావర్ చైతన్య, సర్వేయర్ రాఘవేందర్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పర్యటించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరించారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటుండటంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనలో తహసీల్దార్ పార్థసారథి

నిధులు మంజూరు చేయాలని వినతి

భూత్పూర్: దేవరకద్ర నియోజక వర్గంలోని భూత్పూర్, కౌకుంట్ల మండలాలకు బీటీరోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. నూతనంగా ఏర్పడిన కౌకుంట్ల మండల కేంద్రం నుంచి అడ్డాకుల వరకు, భూత్పూర్ మండల కేంద్రం నుంచి కర్వెనలోని కురుమూర్తి రాయ ప్రాజెక్టు వరకు డబుల్‌రోడ్డును మంజూరు చేయాలని మంత్రిని కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించినట్లు త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. అదేవిధంగా మండలంలోని శేరిపల్లి (హెచ్)కి చెందిన రాజారెడ్డికి మంజూరైన రూ.లక్ష ఆర్థికసాయం చెక్కును ఎమ్మెల్యే బుధవారం అందజేశారు.



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కీర్తనరెడ్డిని అభినందించిన ఎస్పీ



స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్రీయ విద్యాలయం రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో యోగా అండర్-14 విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిన కీర్తనరెడ్డిని బుధవారం జిల్లా ఎస్పీ కె.నరసింహ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కీర్తనరెడ్డి తల్లి ఏఎస్‌ఐ వనజారెడ్డి పాల్గొన్నారు.

సీఐ రజితా రెడ్డికి ఘనంగా వీడ్కోలు

భూత్పూర్: సీఐగా రెండున్నరేళ్ల పాటు విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న రజితారెడ్డికి బుధవారం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మత్స్య సహకారం సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, తదితరులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఇటీవలే హైదరాబాద్‌కు ఆమె బదిలీ అయ్యారు. సీఐ రజితారెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సాదిక్, మండల మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.



సమస్యలు పరిష్కరించడంలో విఫలం



బండ్రపల్లిలో సంతకాలు సేకరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

చిన్నచింతకుంట: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులు ముందుకు రావాలని కోరుతూ బుధవారం బండ్రపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సంతకాలు సేకరించారు. ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. బదిలీలు, పదోన్నతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 25న మండలస్థాయిలో ధర్నాలు చేపడుతామన్నారు. ఉపాధ్యాయులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కుక్కలదాడిలో మేకలు మృతి

నవాబుపేట: మండల కేంద్రంలో బుధవారం కుక్కల దాడిలో మేకలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన గోపాల్ తన పొలంలో మేకలను ఉంచగా కుక్కల గుంపు వాటిపై దాడి చేసింది. దీంతో రూ. 50 విలువ చేసే మూడు మేకలు అక్కడిక్కడే మృతిచెందాయి. దీంతో గోపాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ఆదుకోవాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష, జరిమానా

అడ్డాకుల: మద్యం మత్తులో వాహనాన్ని నడిపిన వ్యక్తికి కోర్టు ఒక రోజు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన జాజలి గణేష్ మే 31న మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ పట్టుబడినట్లు చెప్పారు. మహబూబ్‌గనర్‌లోని స్పెషల్ జ్యుడిషియల్ సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట అతడిని బుధవారం హాజరు పర్చినట్లు వివరించారు. ఈ మేరకు న్యాయమూర్తి నిర్మల ఒక రోజు జైలుశిక్ష, రూ.2వేల జరిమానాను విధించినట్లు వివరించారు. అదేవిధంగా మూసాపేట మండలం అచ్చాయపల్లి గ్రామానికి చెందిన యువకుడు సాయి కుమార్‌కు డ్రంకెన్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు ఎస్‌ఐ విజయ భాస్కర్ తెలిపారు. గత నెల 30న మద్యం మత్తులో వాహనం నడుపుతూ అతడు పట్టుబడినట్లు వివరించారు. బుధవారం అతడిని మహబూబ్‌నగర్ కోర్టులో హాజరుపరిచామని వివరించారు.

మహిళ అదృశ్యం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: వేపూరు గ్రామానికి చెందిన సల్ల సునీత(36) అదృశ్యమైనట్లు ఆమె భర్త శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు. ఎప్పటి మాదిరిగానే మంగళవారం రాత్రి ఇంట్లో భోజనాలు చేసుకొని సునీత ఇంట్లో నిద్రించారు. అర్ధరాత్రి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. ఫలితం లేకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేశారు.

భూత్పూర్: మండలంలోని కర్వెనలో ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం గ్రామానికి చెందిన విద్యార్థిని 17న కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా మధ్యరాత్రి చెప్పా పెట్టకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తాటికొండకి చెందిన సాయి కుమార్‌పై అనుమానం ఉందని విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేశారు. నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఎల్కిచర్లలో..

ఎల్కిచర్లకి చెందిన యాదమ్మ(36) ఈ నెల 15న భర్త మోహన్‌రెడ్డి పొలానికి వెళ్లిన సమయంలో కుమార్తెతో పాటు ఇంటివద్ద ఉండి, తరువాత ఎక్కడికో వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.